క్లుప్తంగా

వంటగది పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో రూ. 3లక్షలతో నిర్మించే వంటగది స్లాబ్‌ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో రూ. 14.50 లక్షలతో నిర్మిస్తున్న డైనింగ్‌ హాల్‌ పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ ఏఈ ప్రభాకర్‌, మాజీ సర్పంచ్‌ శివాంజనేయులు, ఉపసర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ జగన్‌, కాంట్రాక్టర్‌ జగన్‌నాయక్‌, గంగాధర్‌, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని వెల్మకన్నలో సఫాయి కార్మికులకు సర్పంచ్‌ రాజేందర్‌, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ నెల కార్మికులకు నెలకు సరిపోను పప్పులు, బెల్లం, సబ్బులు, సర్ఫ్‌, కొబ్బరినూనె తదితర వస్తువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రం కౌడిపల్లిలో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాహనదారులకు ఆన్‌లైన్‌ ద్వారా జరిమానా విధించారు. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఏఎస్‌ఐ శ్రీనివాస్‌, పీసీలు బాగయ్య తదితరులు వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని వారికి ఫైన్‌ వేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ పెట్టుకోవాలని, మైనర్లు వాహనం నడపొద్దని సూచించారు.

పన్ను వసూలుకు వందశాతం కృషి



ఇంటి పన్ను రశీదు రాస్తున్న కార్యదర్శి

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): గ్రామంలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి జితేందర్‌ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చండూర్‌ గ్రామ పంచాయతీలో పలువురి గ్రామస్తుల ఇంటి పన్ను తీసుకొని, రశీదులు అందజేశాడు. ఈ సందర్భంగా జితేందర్‌ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి యాజమాని తప్పనిసరిగా పంచాయతీకి ఇంటి పన్ను చెల్లించాలన్నారు. ఇంటి పన్నుల వసూలుకు ఇంటింటికి సైతం తిరుగుతున్నామన్నారు.

కాంగ్రెస్‌ పథకాలు దేశానికి ఆదర్శం

టేక్మాల్‌(మెదక్‌): కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు నిమ్మ రమేశ్‌ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ముందుకు వచ్చిందని ప్రజల మెప్పుతో ప్రభుత్వాన్ని చేపట్టిందన్నారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రం శివ్వంపేటలో అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవం గురుస్వాముల ఆధ్వర్యంలో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప కీర్తనలతో ఈ ప్రాంతం మారుమోగింది. మండలంలోని గురుస్వాములు, అయ్యప్ప మాలాధారణ స్వాములు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నాం

- మండల సమావేశంలో ఎంపీపీ హరికృష్ణ



మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రం శివ్వంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌ అశోక్‌ మాట్లాడుతూ... మగ్దుంపూర్‌ ప్రాథమిక పాఠశాల గది శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ.. కొంతన్‌పల్లిలో ఎస్సీలకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పలు గ్రామాల్లోని చెరువుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయని పంటల సాగు కోసం తైబంద్‌ కేటాయించాలని సభ్యులు కోరారు. కిందికి వేలాడుతున్న విద్యుత్‌ వైర్లను సరిచేయాలని సూచించారు. శివ్వంపేటలో స్ట్రీట్‌ లైట్‌ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌ కోరారు. సర్వసభ్య సమావేశానికి పలు గ్రామాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు బదులు వారి భర్తలు హాజరైనప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు చర్చించుకున్నారు.

చేసిన పనులతోనే గుర్తింపు

ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు గుర్తింపు నిస్తాయని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత శాఖ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కొత్త గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మగ్దుంపూర్‌ పాఠశాల గదుల నిర్మాణం కోసం జెడ్పీ కోఆప్షన్‌ మన్సూర్‌ రూ.10 లక్షలు తన నిధుల నుంచి కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ చింతల వెంకట్‌రామిరెడ్డి, తహసీల్దార్‌ శ్రీనివాస్‌చారి, ఎంపీడీఓ భారతి, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

కార్టేవా అగ్రిసైన్స్‌ సేవలు ప్రశంసనీయం

ఎంపీపీ స్వరూపరెడ్డి



ఎంపీడీఓ కార్యాలయానికి కంప్యూటర్‌, ప్రింటర్‌ అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వెల్దుర్తి(తూప్రాన్‌): కార్టేవా అగ్రిసైన్స్‌ సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ స్వరూపరెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం కార్టేవా అగ్రిసైన్స్‌ సంస్థ గవర్నమెంట్‌ అఫైర్స్‌ లీడర్‌ రమేశ్‌ కైలాశం రూ.40 వేలు విలువ కలిగిన నూతన కంప్యూటర్‌, ప్రింటర్‌లను ఎంపీడీఓ కార్యాలయానికి అందజేశారు. దీంతో ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ తరపున గతంలోనూ మానెపల్లి ఉన్నత పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీపీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌, ఎంపీఓ విఘ్నేశ్వర్‌, కార్యాలయ అధికారులు ఆనంద్‌, శైలేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల పర్యవేక్షణ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జగదీశ్వర్‌

నిజాంపేట(మెదక్‌): మండల పరిధిలోని నస్కల్‌ గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ జగదీశ్వర్‌ చారి పల్లె ప్రగతి పనులను పర్యవేక్షించారు. ఈ మేరకు నస్కల్‌ గ్రామ పంచాయతీలోని హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, ఓపెన్‌ జిమ్‌, సెగ్రిగేషన్‌ షెడ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేందర్‌, సర్పంచ్‌ పంగ కవిత, గ్రామ కార్యదర్శి సబితా, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరం చోరీపై ఆగ్రహం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్‌): ఆస్పత్రి నుంచి అగ్నిమాపక పరికరం చోరీ కావడంపై ఎంపీపీ స్వరూపరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ ఆధ్వర్యంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, ఆస్పత్రి వరండా బయట మరో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని కాంట్రాక్ట్‌ వర్కర్‌ యాదమ్మకు నోటీసు ఇచ్చి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ముఖ్యంగా పది రోజుల క్రితం ఆస్పత్రి నుంచి అగ్నిమాపక పరికరం చోరీ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చోరీ చేసిన నిందితులను శిక్షించాలని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. గతంలోనూ ఆస్పత్రిలో పలు వస్తువులు చోరీకి గురికావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, వైస్‌ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌, డా.సౌజన్య, కాంగ్రెస్‌ నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి

- ఆర్డీఓ అంబాదాస్‌ రాజేశ్వర్‌



సమావేశంలో బీఎల్‌ఓలు



మాట్లాడుతున్న ఆర్డీఓ అంబాదాస్‌ రాజేశ్వర్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): రానున్న పార్లమెంట్‌, స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని మెదక్‌ ఆర్డీఓ అంబాదాస్‌ రాజేశ్వర్‌ కోరారు. శుక్రవారం ఈ సందర్భంగా తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువకుల పేర్లను జాబితాలో చేర్చాలని కోరారు. మార్పులు, చెర్పులు ఉంటే సరిచేయాలని సూచించారు. గ్రామంలో వంద శాతం ఓటింగ్‌ జరిగేలా జాబితా ఉండాలని వివరించారు. ఓటరు తుది జాబితాలో చనిపోయిన వారి పేర్లు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ చంద్రశేకర్‌రెడ్డి, ఉప తహసీల్దార్‌ మహేందర్‌గౌడ్‌, ఆర్‌ఐ చంద్రశేఖర్‌తో పా టు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో డాక్టర్లు, రోగులు, క్లబ్‌ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్‌): పట్టణంలోని స్నేహా డిగ్రీ కళాశాలలో, దామరచెరువు గ్రామంలో శుక్రవారం లయన్స్‌క్లబ్‌ ఆఫ్‌ స్నేహబంధు ప్రతినిధులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మెడిసిటీ ఆస్పత్రి డాక్టర్లు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్లు స్త్రీలకు సంబంధించి పలు వ్యాధుల టెస్ట్‌లు నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు, నేత్ర వైద్యులు రోగులను పరీక్షించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని తమ ఖర్చుతో హైదరాబాద్‌లో ఉన్న ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని డాక్టర్లు ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్‌ జోన్‌ చైర్మన్‌ ఐరేని రవీందర్‌గౌడ్‌, ఆస్పత్రికి సంబంధించి మెడికల్‌ టీం సభ్యులు కుమార్‌, సంజయ్‌, సత్యనారాయణ, మనోజ్‌, సుధ, వైష్ణవి, క్లబ్‌ ప్రతినిధులు దామోదర్‌రావు, దీప్‌చంద్‌, నతీశ్‌, తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌ జిల్లాను చార్మినార్‌ జోన్‌లో కలపాలి

పెద్దశంకరంపేట(మెదక్‌): మెదక్‌ జిల్లాను చార్మినార్‌ జోన్‌లో కలిపి ఉద్యోగ నోటిఫికేషన్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్‌ అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెదక్‌ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెదక్‌ జిల్లాను చార్మినార్‌ జోన్‌లో కలుపుతూ ఉద్యోగ నోటిఫికేషన్‌ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్‌ కుమార్‌, కృష్ణ తదితరులు ఉన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

టేక్మాల్‌(మెదక్‌): అర్హులైన ప్రతీ ఒక్కరు రైతు బంధు కోరకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి రాం ప్రసాద్‌ శుక్రవారం తెలిపారు. మండలంలో రైతుబంధు కొరకు కొత్తగా 519 మంది రైతులు, గత వానాకాలం సీజన్‌కి 423 మంది రైతులు దరఖాస్తు చేసుకోలేదన్నారు. మొత్తం 942 మంది రైతులు రైతు బంధు కొరకు పట్ట పాస్‌బుక్‌, ఆధార్‌, బ్యాంకు వివరాలు అగ్రికల్చర్‌ కార్యాలయం నందు ఏఈఓలకు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధిలోని చండి గ్రామంలో కొలువైన చండికాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శంకర్‌ ఆధ్వర్యంలో అభిషేకం, వివిధ రకాల పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణోత్సవం



అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న మెదక్‌ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని చందంపేట గ్రామంలో ఆలయ అర్చకుడు కాశీనాథ శర్మ అధ్వర్యంలో పెద్దమ్మ కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో మెదక్‌ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అంతకు ముందు ఆలయ ఉత్సవాల్లో 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించారు. అమ్మవారి కాల్యాణోత్సవంలో సర్పంచ్‌ శ్రీలతస్వామిరాజ్‌, ఎంపీటీసీ శివకుమార్‌ దంపతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు పట్లోరి రాజు, పోతరాజ్‌ రమణ, కుమార్‌గౌడ్‌, స్వామి, లక్ష్మణ్‌, వైస్‌ ఎంపీపీ సత్యనారాయణగౌడ్‌, ఎంపీటీసీలు యాదగిరి, ప్రసాద్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా ఉంటామని మెదక్‌ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌ కార్యకర్త డప్పు నర్సింలు మృతి చెందాడు. దీంతో అతని భార్య శోభకు రూ. 2లక్షల బీమా చెక్కును ఆమె అందించారు. మాజీ సర్పంచ్‌ కుమార్‌గౌడ్‌, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, బీఆర్‌ఎస్‌ నాయకులు పట్లోరి రాజు, రమణ, యాదగిరి, సత్యనారాయణగౌడ్‌ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

నర్సాపూర్‌ రూరల్‌: సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ విద్యార్థులు అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో వ్యవసాయ విద్యార్థులు శుక్రవారం సర్వే నిర్వహించారు. డి రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్‌ ఫౌండేషన్‌ (కృషి విజ్ఞాన కేంద్రం)లో వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు గ్రామంలో సర్వే చేసి, గ్రామ పటాన్ని ఏర్పాటు చేసి రైతులకు గ్రామస్తులకు సాగుపై అవగాహన కల్పించారు. రైతులు తరచూ పంట మార్పిడి చేస్తూ, సేంద్రియ ఎరువులు వాడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌, రవికుమార్‌, విద్యార్థులు అనుష్క, దేవిశ్రీ, ద్రిష్టి, నితీష్‌, ప్రేసి, బ్రిందా తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం తిప్పలు



హెచ్‌పీ గ్యాస్‌ డీలర్‌ ఆఫీసు వద్ద మహిళలు


నర్సాపూర్‌: వంట గ్యాస్‌ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవడానికి ఎలాంటి గడువు లేదని జిల్లా అధికారులు చెప్తున్నా.. గ్యాస్‌ డీలరు ఆఫీసు వద్ద వినియోగదారులు శుక్రవారం బారులు తీరుతున్నారు. కొన్ని రోజులుగా తమ గ్యాస్‌ కనెక్షన్‌ను ఈకేవైసీ చేయించుకునేందుకు మహిళలు పట్టణంలోని గ్యాస్‌ డీలరు వద్దకు వస్తున్నారు. కాగా హెచ్‌పీ గ్యాస్‌ డీలరు శ్రీనివాస్‌ ఈకేవైసీ కోసం తమ ఆఫీసు వద్దకు రావొద్దని, తమ సిబ్బంది గ్రామాలకు వచ్చి ఈకేవైసీ కోసం థంబ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయంలో చోరీ

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): వీర హనుమాన్‌ ఆలయంలో హుండీ తాళం పగలగొట్టి, డబ్బులు దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన మండంలోని చిట్కుల్‌ గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వీరహనుమాన్‌ ఆలయానికి శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆలయాన్ని శుభ్రపరిచే వ్యక్తి శుక్రవారం ఉదయం ఆలయంలోకి వెళ్లేసరికి హుండీ తాళం పగలగొట్టి ఉండడంతో సర్పంచ్‌ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులకు విషయం తెలియజేశాడు. రెండేళ్లుగా హుండీలోని డబ్బులు లెక్కించడం లేదని, ఈ విషయం పోలీసులకు తెలియజేయడంతో వారు ఆలయాన్ని పరిశీలించారు.

◆ విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి



దాకయ్య(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బోనాల్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేశబోయిన దాకయ్య(55) ఇంట్లో రెండు రోజులుగా విద్యుత్‌ సరఫరా జరగడం లేదు. దీంతో గ్రామానికి చెందిన విద్యుత్‌ పనులు చేసే కొండల్‌రెడ్డి అనే వ్యక్తిని పిలిపించాడు. ఈక్రమంలో దాకయ్య రేకుల ఇంటిపైకి ఎక్కి సర్వీస్‌వైర్‌ను సరి చేస్తున్న క్రమంలో విద్యుత్‌ షాక్‌తో అతడు మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఈ మేరకు కేసు నమోదు చేసి దాకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన



టేక్మాల్‌(మెదక్‌): మండలంలోని ఎల్లుపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శుక్రవారం తహసీల్దార్‌ కృష్ణ, ఆర్‌ఐ సాయి శ్రీకాంత్‌లు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. గ్రామంలోని సర్వేనంబర్‌ 21లో ప్రభుత్వ భూమి ఐదు ఎకరాలను సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని త్వరలో టెక్నికల్‌ టీం బృందం పరిశీలిస్తుందన్నారు. ఇందులో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

◆ పట్టాపాస్‌ పుస్తకాలు ఇవ్వాలని వినతి

చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని చందంపేట గ్రామంలోని 472 సర్వే నంబర్‌ రైతులకు పట్టా పాస్‌ పుస్తకాలు అందించాలని యువజన సంఘాల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌ హైదరాబాద్‌ ప్రజాదర్బార్‌లో శుక్రవారం వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ధరణి ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 472 సర్వే నంబర్‌లోని రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు అందించలేదు. దీంతో రైతులకు బ్యాంకులో రుణాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ ఫారెస్ట్‌ అధికారుల మధ్య సమస్య ఉందని జాయింట్‌ సర్వే నిర్వహించి పాస్‌ పుస్తకాలు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్‌రెడ్డి హామీ ఇచ్చినా.. సమస్య పరిష్కారం కాలేదు. ధరణి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ మేరకు సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో వినతి పత్రం అందించినట్లు ప్రవీణ్‌ తెలిపారు.



◆ వరి నారుమడిని రక్షించుకోవాలి



నర్సాపూర్‌ రూరల్‌: యాసంగిలో రైతులు వరి నారుమడిని యాజమాన్య పద్ధతులు పాటించి రక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి వరి నారుమళ్లను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో చలి నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి మారడంతో పాటు కొన్నిసార్లు నారు చనిపోవటం వంటి వాటిపై రైతులు చేపట్టాల్సిన రక్షణ చర్యలను వివరించారు. సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటిపూట వెచ్చటి నీరు పెడుతూ ఉండాలన్నారు. ప్రతీరోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్‌ షీట్‌ లేదా కల్లాల పట్టాలతో నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసివేయాలన్నారు.

◆ టీకాలు తప్పనిసరి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): పశువులకు సీజనల్‌ వ్యాధులు రాకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని తూప్రాన్‌ ఉమ్మడి మండల పశువైద్యురాలు లక్ష్మీ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం గ్రామంలో సర్పంచ్‌ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పశువుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పశువులకు టీకాలు వేశారు. అవసరమైన వాటికి మందులను సరఫరా చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువుల కోసం ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టి ఉచితంగా మందులను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ వీరేశ్‌, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పశువైద్య బృందం, జేవీఓ మంజుల, రాజారాం, గోపాల మిత్రలు చిరంజీవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

